## మూల్యాంకనము

### I. సరియైన సమాధానమును గుర్తించుము.

1. గ్లోబుపై తూర్పు పడమరగా గీయబడిన ఊహా రేఖను .................. అని అందురు.
   ఎ) అక్షాంశములు  బి) భూమి అక్షము  సి) రేఖాంశములు
2. $0^0$ రేఖాంశము అనగా ...............
   ఎ) గ్రీన్‌విచ్ రేఖ  బి) రేఖాంశములు  సి) భూమి అక్షము
3. దేశములు, ఖండములు, రాజధానులను కలిగిన పటమును ........... అని అందురు.
   ఎ) నైసర్గిక పటము  బి) రాజకీయ పటము  సి) భావనా పటము

### II. క్రింది ప్రశ్నలకు జవాబులనిమ్ము.

1. పటము అనగానేమి?
2. భావనా పటమును వివరింపుము.
3. భారతదేశము యొక్క ఉనికిని తెలుపుము.

### III. పటమును గీయుటకు శిక్షణ

1. నైసర్గిక స్వరూపము, రాజకీయ మరియు భావనా పటములను చూడుము. క్రింది ప్రశ్నలకు జవాబునిమ్ము.
   ఎ) ఏ కొలతలో పటమును గీయుదువు?
   బి) పటములో ఏ సమాచారము ఇవ్వబడినది?
   సి) గుర్తులు మరియు చిహ్నములను పట్టిక ద్వారా విశదీకరించుము.

2. భారత దేశ పటములో రాష్ట్రములను వాటియొక్క రాజధానులను గుర్తించుము.

## రూపక నిర్ధారణ

1. చిహ్నాములను ఉపయోగించి మీ ప్రాంత / వీధి పటమును గీయుము.

2. టాలమీ గీసిన పటమును పరిశీలించి చర్చించుము.

3. ఒక సందర్శన యాత్ర:

ప్రపంచమునందు నీవు ఏఏ ప్రాంతాలను సందర్శించాలనుకుంటున్నావు? ఆ ప్రాంతాల సందర్శనకు నీవు ఏ రకమైన రవాణాను ఉపయోగించాలనుకుంటున్నావు?

ఉపాధ్యాయుడు : నీవు ఎక్కడికి వెళ్ళాలనుకుంటున్నావు?

విద్యార్థి : అంటార్కిటికా

ఉపాధ్యాయుడు : అక్కడికి వెళ్ళడానికి నీవు ఏ రకమైన రవాణాను ఉపయోగించెదవు?

విద్యార్థి : నౌక

విద్యార్థి నౌకాయానము చేయాలనుకుంటే అతడు గోడకు వ్రేలాడదీసిన పటమునందు అంటార్కిటికాను తాకు విధంగా నటింపచేయవలెను. ఈ ఆట ఆడు విధానంలో విద్యార్థులకు దేశాలు, ద్వీపములు, నగరములు వంటి ప్రాంతములను పరిచయము చేయవలెను.

## అభ్యాసము

# భారత రాజకీయ పటము




భారత దేశ పటములో రాష్ట్రములు వాటి రాజధానులను గుర్తించుము

# 1. రాజ్యముల ఆవిర్భావము

### మహా జనపదములు

వేదకాలముయొక్క చివరి దశలో సారవంతమైన భూములు మరియు ఖనిజ సంపద కొరకు చిన్న చిన్న జనపదములు ఒకరితోనొకరు పోట్లాడుకొనుచుండిరి. ఈ ఉద్దేశ్యముతోనే వీరు భారతదేశములోని తూర్పు ప్రాంతములకు సాగి వెళ్ళిరి. అచ్చట సింధూలోయకు తూర్పు మరియు దక్షిణ ప్రాంతములనుండి వచ్చిన ఆర్యేతరులతో కలహించిరి. చివరికి చిన్న జనపదములు ఓడింపబడటమో లేక మహా జనపదములతో కలసిపోవడమో జరిగినది.

అనేక జనపదములు కలిసి మహా జనపదములుగా ఏర్పడినవి. వీరు కులము, తెగలపై ఆధారపడుటకంటే భూములపై ఆధారపడిరి. బుద్ధుని కాలంలో భారతదేశము నందు 16 జనపదములు శక్తివంతమైనవిగా ఉండినట్లు ఆధారములు తెలుపుచున్నవి. వీటిలో కొన్ని వంశపారంపర్య రాజులచే పరిపాలించబడినవి. వైశాలిని రాజధానిగా చేసుకొన్న వజ్జి సంయుక్త పరిపాలనలో 18 వర్గములుగా కలిసియుండినవి. ఆ కాలములో కోసల, అవంతి, వత్స, మగధ అనునవి శక్తివంతమైన ఏకాధిపత్య రాజ్యములు. ఈ రాజ్యములు ఒకరితోఒకరు మరియు ఇతర గణతంత్ర రాజ్యములతో యుద్ధములు చేసుకొనుచుండినవి. చివరికి మగధ అన్ని రాజ్యములను ఓడించి మహాజనపదములలో శక్తివంతమైన సామ్రాజ్యముగా అవతరించినది.

**మహా జనపదములు**

| | | |
|---|---|---|
| 1. అంగ | 7. చేది | 13. అస్మక |
| 2. మగధ | 8. వత్స | 14. అవంతి |
| 3. కోసల | 9. కురు | 15. గాంధార |
| 4. కాశి | 10. పాంచాల | 16. కాంభోజ |
| 5. వజ్జి | 11. మత్స్య | |
| 6. మల్ల | 12. శూరసేన | |

### మగధ సామ్రాజ్య ఆవిర్భావము:

#### బింబిసారుడు-అజాత శత్రువు

ప్రస్తుత బీహార్ రాజధాని అయిన పాట్నా పరిసర ప్రాంతములను మగధ అని పిలిచెడివారు. దీని మొదటి రాజధాని సిరావస్థి, రెండవ రాజధాని రాజగృహ. పాటలీపుత్రము చివరి రాజధానిగా ఉండెను. బింబిసారుడు హర్యంక వంశస్థుడు. ఇతడు దండయాత్ర మరియు వివాహసంబంధముల ద్వారా తన సామ్రాజ్యమును విస్తరించెను. బింబిసారుని కుమారుడైన అజాత శత్రువు తన తండ్రిని చెరసాలలో పెట్టి సింహాసనమును చేపట్టెను. ఇతడు కోసల, అవంతి, వైశాలి మొదలగు మహాజనపదాలతో చాల కాలం పాటు యుద్ధములు చేసి ఆ ప్రాంతములను జయించి మగధ సామ్రాజ్యములో కలుపుకొనెను. పాటలీపుత్రములో అజాత శత్రువు ఒక పెద్ద కోటను నిర్మించెను.

#### శిశునాగుడు - మహాపద్మనందుడు.

శిశునాగుడు హర్యంక వంశమును ఓడించి శిశునాగ వంశమును స్థాపించెను. వీరి తరువాత నంద వంశస్థులు సామ్రాజ్యమును చేపట్టిరి. వీరు మగధ సామ్రాజ్యమును ఉత్తర భారతదేశమంతట వ్యాప్తి చేసిరి. నంద వంశపు మొదటి రాజు అయిన మహాపద్మనందుడు వింధ్య పర్వతములు దాటి దక్కను ప్రాంతములను కలుపుకొనెను. ఇతడు వింధ్యపర్వతముల

నుండి దక్కను వరకు మగధ సామ్రాజ్యమును విస్తరింపజేసెను. ఇది భారతదేశములో శక్తివంతమైన సామ్రాజ్యము.

శిశునాగుడు మరియు మహాపద్మనందుడు శూద్రులైనప్పటికీ వీరు మహారాజులైరి. మహాపద్మనందుడు నంద వంశమును స్థాపించెను. వీరు జైన మతమును ఆదరించిరి. గ్రీసు దేశమునకు చెందిన మాసిడోనియా రాజు అయిన అలెగ్జాండర్ పశ్చిమ వైపు నుండి మగధ సామ్రాజ్యముపై దాడి చేసెను. ఇతని సైనికులు చాలా దూరము ప్రయాణం చేయుట వలన అలసిపోయిరి. నందుల యొక్క సైనిక బలము గూర్చి తెలిసియుండుట వలన యుద్ధము చేయక వెనుతిరిగి వెళ్ళిపోయిరి.

### మౌర్య సామ్రాజ్యము

#### చంద్రగుప్త మౌర్యుడు (క్రీ.పూ. 324-క్రీ.పూ 299)

చివరి నంద రాజయిన ధననందుని ఓడించి చంద్రగుప్త మౌర్యుడు మగధ సామ్రాజ్యం స్థాపించెను. పశ్చిమ భారతదేశముపై దండయాత్ర చేసి



మెగస్తనీస్



చంద్రగుప్త మౌర్యుడు

అలెగ్జాండర్ నాయకత్వంలో గ్రీకులు ఆక్రమించిన ప్రాంతములను కలుపుకొని చంద్రగుప్త మౌర్యుడు మౌర్య సామ్రాజ్యమును విస్తరించెను. తనను ఎదిరించిన గ్రీకు సైన్యాధికారి అయిన సెల్యూకస్ నికేటర్‌ను ఓడించి ఆఫ్ఘనిస్థాన్ మరియు గాంధారలను ఇతడు తన సామ్రాజ్యములో కలుపుకొనెను.

సెల్యూకస్ రాయబారి అయిన మెగస్తనీస్ పాటలీపుత్రములో చాలా కాలము నివసించి భారతదేశమును గూర్చిన విశేషములను తన గ్రంథమైన ఇండికాలో పొందుపరిచెను. చంద్రగుప్త మౌర్యుడు చివరి రోజులలో తన సింహాసనమును వదలి సన్యసించెను. ఇతడు భద్రబాహువు అను జైన సన్యాసితో కలసి దక్షిణ భారతదేశమునకు వెళ్ళినట్లు జైన సాహిత్య గ్రంథముల ద్వారా తెలియుచున్నది. శ్రావణబెళగొళలో చంద్రగుప్తుడు జైనమత విశ్వాసం ప్రకారం జీవించి తనువు చాలించెను

#### అశోకుడు (క్రీ.పూ. 273 – క్రీ.పూ. 236)

చంద్రగుప్తుని తరువాత అతని కుమారుడు బిందుసారుడు 25 సంవత్సరములు పరిపాలించెను. ఇతని తరువాత తన కుమారులలో ఒకడైన అశోకుడు మౌర్యసామ్రాజ్య పరిపాలకుడు అయ్యెను. మొదటి 4 సంత్సరములు అశోకుడు తన సోదరులను ఎదిరించి పోరాడెను. 8 సంవత్సరములు గడిచిన తరువాత ఇతడు మౌర్యసామ్రాజ్యము నుండి విడిపోయిన కళింగపై ఒక భయంకరమైన యుద్ధము చేసి కళింగను మౌర్యసామ్రాజ్యములో కలుపుకొనెను. ఈ ఘోర దృశ్యమును చూసిన అశోకుడు కలత చెంది భవిష్యత్తులో యుద్ధము చేయనని శపథము చేసెను.

### అశోకుని ధర్మ విజయములు

ప్రజలకు సహకరించుట, వారిని సరియైన మార్గములో నడిపించుట మొదలైనవి రాజు యొక్క కర్తవ్యములు అని అశోకుడు ప్రకటించెను. తన చివరి జీవితమంతయూ ప్రజలను కలుసుకొనుచూ వారికి సహాయపడుతూ జీవించెను. దిగ్విజయములను ఇతడు ఇష్టపడలేదు. ధర్మమును ప్రచారము చేయుటకు ధర్మవిజయమును చేపట్టెను. కులమత భేదములు లేకుండా ప్రజలకొరకు సత్రములు, వైద్యశాలలను నిర్మించెను. పశువులు, గుర్రములు మొదలగు జంతువులకు కూడా వైద్యసదుపాయము కల్పించి బలులను నిషేధించెను. మానవతా గుణముతో చట్టములో మార్పులు తీసుకొని వచ్చెను. మరణ శిక్షలను తగ్గించెను. ఇతడు (ధర్మము) దమ్మను ప్రజలమధ్య వ్యాప్తి చేసినట్లు అశోకుని శిలాశాసనములద్వారా తెలియుచున్నది. ధర్మమహామాత్రులను నియమించి ప్రజలకు మానవత్వ విలువలను బోధింపజేసెను. ప్రజాసంక్షేమ రాజ్యమును భారతదేశములో ప్రవేశపెట్టిన మొట్టమొదటి రాజు అశోకుడు.



అశోకుడు



సారనాథ్ స్తంభము

### అశోకుడు మరియు బౌద్ధమతము

బుద్ధుని బోధనలైన ప్రేమ, జ్ఞానము, క్రమశిక్షణలచే అశోకుడు ఆకర్షింపబడెను. అతడు బౌద్ధమతస్థుడైనప్పటికి బ్రాహ్మణులు, అజవికుల పైన దయ చూపించెను. అశోకుడు కపిలవస్తు సారనాథ్, బుద్ధగయలోని స్థూపములను పునరుద్ధరించెను. ఇతడు అనేక స్థూపములు, స్తంభములు నిర్మించి బౌద్ధమత వ్యాప్తి చేసెను.


ఇతడు పాటలీపుత్రములో మూడవ బౌద్ధమహాసభను ఏర్పాటు చేసెను. బౌద్ధమత వ్యాప్తి అశోకుడు బౌద్ధ భిక్షువులను తన సామ్రాజ్యములోని అనేక ప్రాంతములకు మరియు విదేశములకు పంపెను. ఇతడు తన కుమారుడైన మహేంద్రుని, కుమార్తె సంఘమిత్రలను (శ్రీలంక) సిలోనుకు పంపి బౌద్ధ మత వ్యాప్తి చేసెను. అశోకుని కృషివలన బౌద్ధమతము ప్రపంచమతమైనది.

### కళ వాస్తు శిల్పమునకు అశోకుడు చేసిన సేవ

సింధూ నాగరికత కాలమునాటి ప్రాచీన కట్టడముల తరువాత భారతదేశములో లభించిన అశోకుని స్థూపములు మరియు స్తంభములు ప్రాచీనమైనవిగా పరిగణించబడుచున్నవి. సాంచి, లుంబినిలో గల బౌద్ధ స్థూపములు చాలా అద్భుతమైనవి. అశోకుని స్తంభములను ఎటువంటి కళతోను పోల్చుటకు వీలుకాదు. స్థూపముల నిర్మాణ విధానము మరియు స్తంభముల పైభాగములో బోర్లించబడిన తామర పుష్పము ఆకారము పర్షియన్ శిల్పకళారీతికి నిదర్శనములు.

### అశోకుని శిలాశాసనములు

అశోకుని రాజ ప్రకటనలు, బోధనలు గుహల గోడలలోను, రాతి స్తంభములపైనను చెక్కబడి సామ్రాజ్యములోని అన్ని ప్రాంతములలోను ఉంచబడినవి. వీటిలో ఎక్కువ భాగము ప్రాకృత భాషలో వ్రాయబడెను. వాయవ్య భారతదేశములో ఖరోష్ఠి భాషలోను, ఆఫ్ఘనిస్తాన్ లోని కొన్ని ప్రాంతములలో గ్రీకు భాషలో చెక్కబడెను. ఇవి అశోకుని అహింస, మానవత్వము మరియు ప్రేమను గూర్చి తెలుపుచున్నవి.



అశోకుని శిలాశాసనములు

> **అశోకుని శిలా శాసనములు**
>
> "నేను 8 సం॥ యుద్ధం చేసి కళింగను జయించితిని ఈ యుద్ధములో లక్షమంది ప్రజలు చనిపోగా ఒక లక్షా 50వేలమంది ప్రజలు దేశమును విడిచి వెళ్ళిరి.
>
> జనపద యుద్ధములో లక్షలమంది ప్రజలు చనిపోవడమో లేక పట్టుబడడమో నాకు చాలా దు:ఖమును కలిగించెను. ఈ యుద్ధము ప్రేమాభిమానము కల్గిన వారిని విడదీసినది.
>
> ఈ యుద్ధములో జరిగిన ఘోరదృశ్యములు అనేక మంది ప్రజలను బాధించినది. నన్ను కూడ బాధపెట్టినది. కావున నేను యుద్ధమును విడనాడి ధర్మమును స్వీకరించితిని".
>
> **– అశోకుడు**

### మౌర్యుల పరిపాలనా విధానము


అశోకుడు తన సామ్రాజ్యమును పరిపాలనా సౌలభ్యం కొరకు ఐదు రాష్ట్రములుగా విభజించెను. అవి

1. ఉత్తర రాష్ట్రములకు రాజధాని తక్షశిల.
2. పశ్చిమ రాష్ట్రములకు రాజధాని ఉజ్జయిని.
3. దక్షిణ రాష్ట్రములకు రాజధాని స్వర్ణగిరి. (కర్ణాటక)
4. తూర్పు రాష్ట్రములకు రాజధాని దోశాలి. (ఒడిషా)
5. ముఖ్యరాష్ట్రము అయిన మగధను, పాటలీపుత్రమును రాజధానిగా చేసుకొని అశోకుడు స్వయముగా పరిపాలించెను.

మంత్రులు మరియు సైన్యాధికారులు పరిపాలనలో రాజుకు సహాయపడిరి. వీరు కుల, మత బేధములు లేకుండా నియమించబడిరి. ఉన్నతాధికారులైన మహామాత్రులు గవర్నర్లుగాను, నిర్వాహకులుగాను నియమించబడిరి. యువరాజులు కూడా మహామాత్రులుగా నియమింపబడిరి. వీరితో పాటు యుక్తులు, ప్రాదేశికులు, రాయబారులు మరియు గూఢచారులు అనబడు మరికొందరు అధికాలుండిరి. దేశ సరిహద్దులను కాపాడు వారిని అంత మహామాత్రులు అని పిలిచిరి. ప్రజల నీతికి సంబంధించిన విషయములను గమనించు వారిని ధర్మ మహామాత్రులు అని పిలిచిరి.

నగరములో స్థానిక స్వపరిపాలన విధానము ఉండెను. పాటలీపుత్ర నగరమును పరిపాలించుటకు 30 మంది అధికారులు కలిగిన 6 కమిటీలు ఏర్పాటు చేయబడినట్లు మెగస్తనీస్ వ్రాసిన ఇండికా గ్రంథము ద్వారా తెలియుచున్నది. ప్రతి కమిటీకి ప్రత్యేకమైన విధులు కలవు.

మౌర్య సామ్రాజ్యములో 30మంది అధికారులతో 6 కమిటీలుగా గొప్ప సైనిక దళము ఏర్పరచబడినది. కాల్బలము, అశ్వదళము, గజదళము, రథములు, నౌకాదళము మొదలగు వాటిని 5 కమిటీలు పర్యవేక్షించెడివి. రవాణా, ఆహారం వైద్యసదుపాయములు మరియు యుద్ధపరికరముల ఉత్పత్తులను 6వ కమిటీ పర్యవేక్షించెను.



ఆశోకుని కాలములో
మౌర్యసామ్రాజ్యము
సెల్యూకస్ నికేటర్ ఆక్రమించిన ప్రాంతము
తక్షశిల
ఇంద్రప్రస్థము
పాటలీపుత్రము
సారనాథ్
గయ
సాంచి
ఉజ్జయిని
గిర్నార్
తామ్రలిప్తి
దోశాలి
కళింగ
స్వర్ణగిరి
సిద్దాపూర్
సత్యపుత్ర
కంచి
కేరళపుత్ర
చోళ
పాండ్య
శ్రీలంక
అశోకుని పరిపాలనా కాలములో మౌర్య సామ్రాజ్యము

న్యాయ పరిపాలన చాలా కఠినముగా ఉండెను. మానవతాదృక్పధముతో న్యాయపరిపాలనలో అశోకుడు అనేక మార్పులను తీసుకొని వచ్చెను. హింస నిషేధించబడెను. మరణశిక్ష ఖైదీలను ఓదార్చుటకు ఇతడు కొన్ని క్రొత్త పద్ధతులను ప్రవేశపెట్టెను. చిన్న చిన్న తప్పులు చేసిన ఖైదీల శిక్షాకాలము తగ్గించెను. ప్రజల కష్టములను తీర్చుటకు రాజు మరియు మంత్రులు స్వయంగా ప్రజల వద్దకు వెళ్ళెడి వారు.

మౌర్యవంశ చివరి రాజు అయిన బృహద్రదుడు, తన సైన్యాధికారి అయిన పుష్య మిత్రునిచే చంపబడెను. చివరకు మగధ సామ్రాజ్యము 500 సంవత్సరముల తరువాత క్రమముగా తన ప్రాబల్యమును కోల్పోయెను.

## మూల్యాంకనము

### I. సరియైన సమాధానమును ఎన్నుకొనుము.

1. పాటలీ పుత్రము వద్ద కోటను నిర్మించినవారు
   ఎ) అశోకుడు  బి) బింబిసారుడు  సి) అజాత శత్రువు
2. మెగస్తనీస్ రచించిన గ్రంథము.
   ఎ) అర్థశాస్త్రము  బి) ఇండికా  సి) ముద్రా రాక్షసము
3. అశోకుడు సింహాసనమును అధిష్టించిన సంవత్సరము
   ఎ) క్రీ.పూ 232  బి) క్రీ.పూ 273  సి) క్రీ.పూ 255
4. మూడవ బౌద్ధమత మహాసభ జరిగిన స్థలము
   ఎ) పాటలీపుత్రము  బి) కాశ్మీర్  సి) కపిలవస్థు

### II. తప్పు లేక ఒప్పు

1. మెగస్తనీస్ యొక్క రాయబారి సెల్యూకస్ నికేటర్.
2. మహాపద్మనందుడు నందవంశములో మొదటి రాజు.
3. అశోకుడు దమ్మ విజయమును త్యజించి దిగ్విజయమును స్వీకరించెను.
4. ప్రజా సంక్షేమ రాజ్యమును మొట్టమొదట ప్రారంభించిన రాజు అశోకుడు.
5. మహేంద్రుడు (శ్రీలంకలో) సిలోన్‌లో బౌద్ధ మతమును వ్యాప్తి చేసెను.

### III. క్రింది ప్రశ్నలకు జవాబులిమ్ము

1. మహాజనపదములు ఏ విధముగా వ్యాప్తి చెందినవి?
2. భారత దేశములో మొట్టమొదట సామ్రాజ్యమును ఏర్పరిచిన ఘనత ఎవరిది? వివరింపుము.
3. భారతదేశములో మొట్టమొదట ప్రజాసంక్షేమ రాజ్యము ఏర్పరచిన రాజు అశోకుడు అని చెప్పబడుచున్నది. ఎందులకు?
4. అశోకుని జీవితము మారుటకు కారణమేమి?
5. అశోకుని శిలాశాసనములలో చెక్కబడిన శాసనములను గూర్చి వ్రాయుము.

## రూపక నిర్ధారణ

1. ప్రాచీన కాలములో రాజుల మధ్య జరిగిన యుద్ధముల వలన సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యిరి. ప్రస్తుత రోజులలో ప్రజలు ఏ విధమైన ఇబ్బందులకు గురి అవుచున్నారో వివరించండి.
2. మీకు సమీపములో ఉన్న శిలాశాసనాన్ని సందర్శించి అందులోని అక్షరాలను చదువుటకు ప్రయత్నించుము.
3. సారనాథ్ శిలా స్తంభము చిత్రమును గీయుము లేదా స్తంభ చిత్రము నుండి నీవు తెలుసుకున్న విషయాలను వ్రాయుము.
4. ఇవ్వబడిన పటమునందు అశోకుని కాలమునాటి మౌర్య సామ్రాజ్య ఎల్లలను గీచి క్రింద పేర్కొన్న ప్రాంతములను గుర్తించుము.
   - తక్షశిల
   - ఇంద్రప్రస్థము
   - పాటలీపుత్రము
   - సారనాథ్
   - గయ
   - కళింగ
   - గిర్నార్

# 2. కుషాణు సామ్రాజ్యము

మౌర్య సామ్రాజ్య పతనము తరువాత భారతదేశములో స్థాపించబడిన శక్తివంతమైన సామ్రాజ్యము కుషాణు సామ్రాజ్యము. కుషాణులు యూచీ తెగకు చెందినవారు. క్రీ.శ. 1వ శతాబ్దములో భారతదేశపు వాయవ్య ప్రాంతమున మొదటి కాడ్ఫైసిస్ చేత కుషాణు సామ్రాజ్యం స్థాపించబడెను. ఇతని తరువాత వచ్చిన రెండవ కాడ్ఫైసిస్ (క్రీ.శ.65 – 75), మొదటి కాడ్ఫైసిస్‌ను జయించి పంజాబ్ మరియు సింధులోయ ప్రాంతములను ఆక్రమించెను.

### కనిష్కుడు (క్రీ.శ. 78 – క్రీ.శ. 101)

రెండవ కాడ్ఫైసిస్ మరణించిన తరువాత కనిష్కుడు కుషాణు సామ్రాజ్యమును చేపట్టెను. ఇతడు కుషాణు చక్రవర్తులలో ప్రసిద్ధి చెందిన రాజు.

కనిష్కుడు పాటలీపుత్రముపై దాడి చేసి శకులను జయించెను. రెండు పర్యాయములు చైనాపై దాడి చేసెను. మొదటి దాడిలో కనిష్కుడు చైనా సైన్యాధిపతి అయిన పాన్-చా-వో చేతిలో ఓడించబడెను. రెండవ దాడిలో ఇతడు కాష్గర్, యార్ఖండ్ మరియు కోతాన్ అను మధ్య ఆసియా ప్రాంతములను తన సామ్రాజ్యములో కలుపుకొనెను. ఇతడు పురుషపురము (పెషావర్) అను క్రొత్త రాజధానిని నిర్మించెను.

కనిష్కుడు బౌద్ధమతముచే ఆకర్షించబడెను. ఇతడు కాశ్మీర్‌లో నాల్గవ బౌద్ధమత సమావేశము ఏర్పాటు చేసెను. సుప్రసిద్ధ బౌద్ధ తత్వవేత్తలయిన వసుమిత్రుడు, అశ్వఘోషుడు మరియు నాగార్జునుడు ఈ నాల్గవ బౌద్ధమత సమావేశములో పాల్గొనిరి. ఈ సమావేశములో బౌద్ధమతము నందు మహాయానము అను క్రొత్త శాఖ ఏర్పడెను. మహాయానమును వ్యాప్తి చేయుటకు బౌద్ధసన్యాసులు టిబెట్ మరియు చైనా దేశములకు పంపబడిరి.




మహాయాన బౌద్ధమత పండితుడు అయిన అశ్వఘోషుడు సంస్కృతభాషలో 'బుద్ధ చరితము' 'సూత్రాలంకారము' అను గ్రంథములను, వసుమిత్రుడు మహావిభాష్యము అను గ్రంథమును రచించెను. నాగార్జునుడు తత్వ గ్రంథములను రచించెను. గొప్ప వైద్య శాస్త్రజ్ఞుడైన చరకుడు మరియు గొప్ప భవన నిర్మాత అయిన అజిలాసిమ్ మొదలైన వారు కనిష్కుని ఆస్థానమున ఉండిరి.


గాంధార శిల్పకళ భారతీయ మరియు గ్రీకు శిల్పకళా రీతులతో కూడినది. ఈ రీతిలో బోధిసత్వుల, బుద్ధుని శిల్పములు చెక్కబడినవి. బౌద్ధమత వ్యాప్తికై కనిష్కుడు అశోకుని వలె చాలా కృషి చేసినందువలన ఇతనిని 'రెండవ అశోకుడని' పిలిచిరి. కనిష్కుడు సింహాసనమును అధిష్టించిన సంవత్సరమున శకయుగము ప్రారంభమయ్యెను. ఇతడు తన గుడారములో శత్రువులచే చంపబడెను. ఇంతటితో కుషాణు సామ్రాజ్యము అంతరించెను.

## గుప్త సామ్రాజ్యము

కుషాణుల తరువాత ఉత్తర భారతదేశములో వెలసిల్లిన సామ్రాజ్యమే గుప్త సామ్రాజ్యము. వీరి రాజధాని పాటలీపుత్రము. గుప్త వంశ రాజులలో మొదటి చంద్రగుప్తుడు (క్రీ.శ. 319 - క్రీ.పూ. 335) పేర్కొనదగిన రాజు. ఇతడు రాజ్యమునకు వచ్చిన సంవత్సరమును గుప్తయుగము ప్రారంభము అని పిలిచిరి. మొదటి చంద్రగుప్తుని తరువాత వచ్చిన సముద్రగుప్తుడు (క్రీ.శ. 335 - క్రీ.శ 375) పరిపాలించెను. ఇతని దండయాత్రలు మరియు విజయములను గూర్చి అలహాబాదు శిలాశాసనము తెలియజేయుచున్నది. గుప్త సామ్రాజ్యము తూర్పున బెంగాల్ నుండి పశ్చిమమున సింధూనది వరకు ఉత్తరమున హిమాలయ పర్వతముల నుండి దక్షిణమున వింధ్య పర్వతముల వరకు విస్తరించియుండెను. ఇతడు 9 మంది ఉత్తర భారతదేశ రాజులను, 11మంది గణతంత్ర రాజులను, 12మంది దక్షిణ భారతదేశ రాజులను జయించినట్లు అలహాబాదు శిలాశాసనము తెలియజేయుచున్నది. ఇతని మంత్రి అయిన హరిసేనుడు అలహాబాదు శిలాశాసనమును చెక్కించెను. సముద్రగుప్తుని తరువాత రెండవ చంద్రగుప్తుడు( క్రీ.శ 380 - క్రీ.శ 414) ప్రసిద్ధి చెందిన రాజు. ఇతడు విదేశీయులైన శకులను జయించి ఉజ్జయినిని ఆక్రమించెను.



అజంతా గుహ చిత్రము



మెహరౌలీ ఇనుప స్తంభము

ప్రాచీన ఇతిహాసములైన రామాయణము, మహాభారతము, 18పురాణములు మరియు పంచతంత్ర కథలు గుప్తుల కాలంలో వ్రాయబడినవి. సంస్కృత విద్వాంసులు అయిన కాళిదాసు, విశాఖదత్తుడు మొదలైన వారు ఆదరించబడిరి. వీరి రాజభాష సంస్కృతము. విష్ణువు, శివుడు మరియు దుర్గ మొదలైన దేవదేవతలకు వీరు దేవాలయములు నిర్మించిరి. అజంతా గుహలలోని అందమైన చిత్రములు గుప్తుల కాలము నాటివే.

గణిత మరియు ఖగోళశాస్త్రజ్ఞుడైన ఆర్యభట్టు మరియు జ్యోతిష్య శాస్త్రములో గొప్ప పండితుడైన వరాహమిహురుడు, వైద్య శాస్త్రజ్ఞులైన సుశ్రుతుడు మరియు ధన్వంతరి గుప్తుల కాలమునకు చెందినవారు. ఢిల్లీకి సమీపంలోని మెహరౌలీ అను చోట ఉన్న ఇనుప స్తంభము 1500 సంవత్సరములుగా త్రుప్పు పట్టకుండా ఉన్నది. ఇది గుప్తుల కళా నైపుణ్యమునకు నిదర్శనము. వీరి కాలములో నలంద విశ్వ విద్యాలయము కుమార గుప్తునిచే స్థాపించబడెను.

కులవ్యవస్థ పతనమయ్యెను. అశోకుని కాలములో నిషేధించబడిన బలులను వీరు పునరుద్ధరించిరి. వీరు శివుడు, విష్ణువు, కుమరన్ (మురుగన్) మొదలైన వారి దేవాలయములు నిర్మించి పూజించిరి. గుప్తుల కాలమును స్వర్ణయుగము అని అందురు. పుష్యమిత్రుడు మరియు హూణుల దండయాత్రల వలన గుప్తుల సామ్రాజ్యము క్షీణించెను. చైనా యాత్రికుడైన ఫాహియాన్ రెండవ చంద్ర గుప్త విక్రమాదిత్యుని కాలములో భారతదేశములోని బౌద్ధమత విహార స్థలములను సందర్శించెను.



హర్షుడు



నలందా విశ్వవిద్యాలయము


## హర్ష సామ్రాజ్యము

గుప్తుల పతనానంతరము స్థానేశ్వర్ పరిపాలకుడు అయిన హర్షవర్ధనుడు (క్రీ.శ. 606 – క్రీ.శ. 647) ఉత్తర భారతదేశములో ఒక గొప్ప సామ్రాజ్యమును ఏర్పరిచెను. హర్షుడు తన అన్నను చంపిన శశాంకునితో చాలా కాలము యుద్ధము చేసెను. ఈ యుద్ధములో కామరూప (అస్సాం) రాజు అయిన భాస్కరవర్మ ఇతనికి సహాయం చేసెను. శశాంకుని మరణానంతరము బెంగాల్ రాజ్యములోని అనేక ప్రాంతములను హర్షుడు తన సామ్రాజ్యంలో కలుపుకొనెను. హర్షుడు తన సోదరి అయిన రాజశ్రీ యొక్క కోరిక మేరకు కనోజ్‌కు రాజయి దానిని రాజధానిగా చేసుకొనెను. ఇతడు మాళ్వ, సింధు, ఒరిస్సాలను జయించెను. దక్షిణ భారతదేశమును ఆక్రమించుటకు ప్రయత్నించెను కానీ చాళుక్య రాజైన రెండవ పులకేసి చేత ఓడించబడెను.

హర్షుడు తన సోదరి మరియు చైనా యాత్రికుడైన హుయాన్‌త్సాంగ్‌లచే ప్రభావితుడై బౌద్ధమతమును స్వీకరించెను. ఇతడు కనౌజ్ మరియు ప్రయాగలలో బౌద్ధమత సమావేశములను ఏర్పాటుచేసెను. ఈ సమావేశములకు అనేక మంది బౌద్ధ సన్యాసులు మరియు మత విద్వాంసులు పాల్గొనిరి. ఈ సమావేశపు చివరలో హర్షుడు తన సంపదనంతయూ విశాల హృదయముతో బౌద్ధ సన్యాసులకు, విద్వాంసులకు మరియు ప్రజలకు పంచిపెట్టెను.

నలంద విశ్వవిద్యాలయము ఇతని కాలములో ఒక గొప్ప విద్యా పీఠముగా వెలుగొందెను. ఈ విశ్వ విద్యాలయము దేశవిదేశ విద్యార్థులను ఆకర్షించెను.

హర్షుడు తన పరిపాలన కాలంలో ప్రజల వద్దకు స్వయంగా వెళ్ళి మంచి చెడులను తెలుసుకొనెడి వాడు. ఇతని కాలములో కళ మరియు వాస్తు శిల్పం బాగా పోత్సహించబడెను. సంస్కృత పండితుడైన బాణుడు ఇతని ఆస్థాన పండితునిగా ఉండెను. ఇతడు హర్షచరితము అను గ్రంథమును రచించెను. హర్షుడు కూడా స్వయంగా గొప్ప కవి. ఇతడు రత్నావళి, నాగానందము, ప్రియదర్శిక అను నాటకములను రచించెను.



ఇతని కాలములోనే చైనా యాత్రికుడైన హుయాన్ త్సాంగ్ భారదేశమునకు వచ్చి కనౌజ్, ప్రయాగ, నలంద, మరియు కాంచీపురములను సందర్శించెను. ఇతడు కొంతకాలము హర్షుని ఆస్థానములో బసచేసెను. ఇతని గ్రంథమైన 'సి-యూ-కి' బౌద్ధమతమును గురించి, అప్పటి భారతదేశమును గురించి వివరించుచున్నది. ముస్లిముల దండయాత్రలకు పూర్వము ఉత్తర భారతదేశములోని గొప్ప సామ్రాజ్యములలో చివరిది హర్షసామ్రాజ్యము.

## మూల్యాంకనము

### I. ఖాళీలను పూర్తి చేయుము.

1. ______________ కుషాణు వంశమును స్థాపించెను.
2. బుద్ధచరితమును ______________ రచించెను.
3. ______________ గుప్తుల కాలములో గొప్ప వైద్య విద్వాంసుడు.
4. స్థానేశ్వరమునకు రాజు ______________.
5. గుప్తుల కాలమును భారతదేశపు ______________ అని పిలిచిరి.

### II. తప్పు లేక ఒప్పు

1. కనిష్కుని రాజధాని పెషావర్.
2. సి-యు-కి ని హుయాన్‌త్సాంగ్ రచించెను.
3. అజిలాసిమ్ ఒక గ్రీకు భవన నిర్మాత.
4. మెహరౌలీ స్తంభము గుప్తుల కాలమునకు చెందినది.
5. అశ్వఘోషుడు సూత్రాలంకారమును రచించెను.

### III. జతపరచుము.


| | |
|---|---|
| 1. నాల్గవ బౌద్ధమహాసభ | – యూచీతెగ |
| 2. సముద్ర గుప్తుని కాలము | – కనిష్కుడు |
| 3. కనిష్కుని కాలము | – కుమారగుప్త |
| 4. బాణుడు | – కుషాణు సామ్రాజ్యమును స్థాపించెను |
| 5. హర్షుడు | – క్రీ.శ. 335 – క్రీ.శ. 375 |
| 6. కుషాణులు | – క్రీ.శ.78– క్రీ.శ.101 |
| 7. రెండవ అశోకుడు | – హర్ష చరితము |
| 8. నలంద విశ్వవిద్యాలయము | – కాశ్మీర్ |
| 9. కాడ్ ఫైసిస్-1 | – ప్రియదర్శిక |

### IV. జవాబులు వ్రాయుము

1. గాంధార శిల్పకళ గురించి వివరించుము.
2. గుప్తుల కాలమును స్వర్ణయుగమని ఎందుకు పిలిచిరి?
3. గుప్త సామ్రాజ్య క్షీణతకు కారణమైన విదేశీ దండయాత్రికులెవరు?
4. శకయుగము మరియు గుప్తయుగమును గురించి వివరింపుము.
5. ఫాహియాన్ మరియు హుయాన్ త్సాంగ్ ను గురించి వ్రాయుము.

# రూపక నిర్ధారణ

1. ఖాళీలను పూరింపుము.



2. గ్రంథాలయమునందు నీవు చదివిన గ్రంథములు మరియు రచయితల పేర్లను వ్రాయుము.

3. రవాణా సౌకర్యములు లేని ఆ కాలములో హుయాన్‌త్సాంగ్ భారతదేశమును సందర్శించుటకు ఎట్లు వీలు కలిగినది? చదివినపుడు లేదా వినినప్పుడు వారి ప్రయాణ అనుభవాలను తెలుసుకొనుము.

4. రాజుల ప్రధాన ఆసక్తి దేనిపై ఉండెను – చర్చించుము.

   1. యుద్ధము

   2. సమాజసేవ